క్లుప్తంగా

భద్రాద్రి సీతారాముల తలంబ్రాల పంపిణీ

మరికల్: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వాసవీ సేవాసమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పూరి సురేశ్ కుమార్ మాట్లాడుతూ.. శ్రీరామ కోటి సహకారంతో సీతారాముల వారి కల్యాణ తలంబ్రాలను ప్రతి గ్రామానికి పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేశ్, ప్రకాశ్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూలర్ వితరణ



మరికల్: మండలంలోని గాజులయ్యతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మంగళవారం కర్ని మాజీ ఎంపీటీసీ రాధా దత్తారామ్ కూలర్ వితరణ చేశారు. వేసవి దృష్ట్యా తరగతి గదిలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా కూలర్ అందజేసిన దాతను హెచ్ఎం లక్ష్మయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నవీన్ అభినందించారు.

ఆలయానికి విరాళం

మాగనూర్: మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం అభివృద్ధికి కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాకు చెందిన దివ్య, దత్తకుమార్ దంపతులు మంగళవారం రూ. 25వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మారెమ్మవ్వ ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.

బీకేఎస్ జెండావిష్కరణ

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శరణయ్యస్వామి సంఘం జెండాను ఎగరవేసి మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీకేఎస్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, బుచ్చయ్య, లాలప్ప, పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తిలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి స్మారకార్థం గురువారం వీరహనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ ఆర్గనైజర్స్ భాస్కర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో బహుమతులుగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈపోటీలు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించబడుతాయని సూచించారు. వివరాలకు 96033 54369, 91828 71213 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి



అమరచింత: మండలంలోని ధర్మాపురం గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా నాయకులు వెంకటేష్, అజయ్ మాట్లాడుతూ మంజూరైన బీటీ రహదారిని నేటికీ నిర్మించకపోవడం వింతగా ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలను చేస్తుందే తప్పా వాటిని ఆచరించడం లేదన్నారు. వారం రోజుల కిందట గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి అధికారులకు నివేదించామన్నారు. సమస్యల పరిష్కారం కోసం పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తున్నామని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. సీసీ రహదారులు లేకపోవడంతో అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు అవుతున్నా జీపీ భవనానికి సొంత భవనం లేకపోవడం శోచనీయం అన్నారు. లో ఓల్టేజీ సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం శంకర్‌రాజు, మోహన్, మన్యం, బాలు, రాములు,మాసన్న, చంద్రాయుడు, తిరుమలేష్ పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- పేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సహకరించాలి
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



కాట్రేవ్‌పల్లి గ్రామ రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వపరంగా అన్నివిధాలా న్యాయం చేస్తామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లిలో సంబంధిత అధికారులు చేపట్టిన మట్టి నమూనాల సేకరణ, సర్వే పనులను ఇటీవల గ్రామ రైతులు అడ్డుకున్నారు. భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేసే వరకు మట్టి నమూనాల సేకరణ, సర్వే పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం కాట్రేవ్‌పల్లి గ్రామానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. జిల్లా రైతులకు సాగునీటి వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం పూర్తయితే 1.20లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొడంగల్‌లో భూమి ధర మేరకు కాట్రేవ్‌పల్లి గ్రామ రైతులకు ఇప్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని చెప్పారు. ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

కంటి వైద్యశిబిరం ప్రారంభం..

మండలంలోని గడ్డంపల్లి రైతువేదికలో వాకిటి శ్రీహరన్న సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గడ్డంపల్లి, అనుగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమన్వయంతో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. 135 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 75 మందికి దృష్టిలోపం సమస్యలు ఉన్నట్లు గుర్తించి.. కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. అదే విధంగా మక్తల్‌లో ఐసీడీఎస్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేశ్‌కుమార్, ఆనంద్‌గౌడ్, ఏఈ నాగశివ, సీఐ రాంలాల్, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, కంటి వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, సత్యంగౌడ్, విజయ్, లింగప్ప, నూరుద్దీన్, హసముద్దీన్, నర్సింహ, నరేందర్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దు



కోస్గిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి/మరికల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్లు బక్క శ్రీనివాసులు, అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం కోస్గి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మరికల్ ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వంట గది, కూరగాయలు, బియ్యం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అదే విధంగా ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి..



రాంపూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రామకృష్ణ

నర్వ: మధ్యాహ్న భోజన పథకంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో తాజా కూరగాయలు, నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈఓ వెంట హెచ్ఎం ఉస్మాన్ ఖాదర్, ఉపాధ్యాయిని అనిత, ఐఈఆర్పీ రవి తదితరులు ఉన్నారు.

వైభవంగా గజ్జలమ్మ ఉత్సవాలు



పేరపళ్ల గజ్జలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్ల గ్రామంలో మంగళవారం గజ్జలమ్మ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గ్రామ శివారు నుంచి పురవీధుల గుండా జల్దిబిందె ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దారి పొడవునా నీరు పోస్తూ స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఆలయంలో గజ్జలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బోనాల ఊరేగింపు అనంతరం జాతర నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు.

ముగిసిన ఎల్లమ్మ జాతర..



లింగంపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

మండలంలోని లింగంపల్లిలో ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ముగిశాయి. జిల్లాలోనే అత్యంత ప్రత్యేకత కలిగిన లింగంపల్లి ఎల్లమ్మ ఉత్సవాల చివరి రోజున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కొత్త కుండలో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపనోత్సవాలు



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో తిరుమల దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం స్వామివారికి ధాన్యాధివాసం, శయనాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో హోమాలు చేశారు. రుత్వికుల వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన హోమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రాత్రి గ్రామ భక్తమండలిచే అఖండ భజనలు చేశారు.

బీజేపీ నాయకుల పరామర్శ

నారాయణపేట రూరల్: బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ తండ్రి లక్ష్మణ్ ఇటీవల మృతిచెందారు. అతడి కుటుంబ సభ్యులను మంగళవారం బీజేపీ జిల్లా నాయకులు పరామర్శించారు. ముందుగా లక్ష్మణ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పరామర్శించిన వారిలో బీజేపీ నాయకులు రఘువీర్ యాదవ్, రాంచంద్రయ్య, గోవర్ధన్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ శాఖలో అధికారులకు నడుస్తున్న అద్దె వాహనాలకు చెందిన పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సల్లావుద్దీన్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో మెయింటనెన్స్ చేయడానికి అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఆత్మకూర్: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవరపల్లి గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.1.20 లక్షలను పోగుచేసి సీఐ, ఎస్ఐ కి అందజేశారు. అనంతరం రేచింతల గ్రామస్తులు రూ.70 వేలు, కత్తేపల్లి గ్రామస్తులు రూ.30 వేలు సమకూర్చి ఎస్ఐ కి అందజేసారు. మన్యం, కావలి స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వేధింపులకు గురిచేస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

కోస్గి రూరల్: మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని షీ టీం పోలీసు బాలరాజు, భరోసా కేంద్రం ప్రతినిధి శారద అన్నారు. మంగళవారం గుండుమాల్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బ్లాక్ మెయిల్, సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తే సహించేది లేదన్నారు. బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే షీ టీంను సంప్రదించాలని సూచించారు. మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ, వ్యభిచారం, బాల్యవివాహాలు వంటివి చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. బాధిత మహిళలకు భరోసా కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ



రోబోటిక్స్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కోస్గి రూరల్: గుండుమాల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగంలో సృజనాత్మకతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్స్ ఇన్ అకాడమీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గుండుమాల్ పాఠశాలకు చెందిన 132 మంది, సర్జఖాన్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన 129మంది, పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 156 మంది విద్యార్థులకు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను తెలియజేసినట్లు వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వీరు ఏడాది పాటు ఇన్నోవేషన్ చాలెంజ్‌లో పాల్గొని ప్రతిభ కనబరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, మల్లిఖార్జున్, సాయప్ప, మధుసూదన్, బాలకిష్టయ్య, స్రవంతి, ఉమాదేవి పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం



ధన్వాడలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఓఎంఐఎఫ్ ప్రతినిధులు

నారాయణపేట టౌన్: మహిళలపై జరుగుతున్న దాడులను ఆపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరగడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు తమ కార్యకలాపాలు నిర్వహించుకుని తిరిగి తమ ఇంటికి చేరుకోలేని పరిస్థితి ఇంకా ఉండటం దారుణమన్నారు. కార్యక్రమంలో సమీనా, రాజేశ్వరి, బాలమణి, ప్రజా సంఘాల నాయకులు వెంకట్రామిరెడ్డి, బలరాం, గోపాల్, కాశప్ప పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మద్దూరు/ధన్వాడ: మద్దూరు పట్టణంలో ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ అనంతరం పాతబస్టాండ్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి.. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను శాలువాలతో సత్కరించారు. సంస్థ కోఆర్డినేటర్ కృష్ణ, హెల్త్ వర్కర్లు నాగమణి, లాలమ్మ, స్వామి, మాధురి, అంజమ్మ, భూమిక సంస్థ సభ్యులు నాగమ్మ, పద్మ పాల్గొన్నారు.

- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో ధన్వాడ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ అనూష, కానిస్టేబుల్ రామదేవిని సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ హాజమ్మ, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు నర్సింగమ్మ, మంగమ్మ, జ్యోతి, ప్రవీణ, ఉమా, అంజమ్మ, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఇటుక బట్టీలతో అవస్థలు



కృష్ణా రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన ఇటుక బట్టీలు

కృష్ణా: మండల కేంద్రం సమీపంలోని నల్లగట్టు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఇటుక బట్టీల ఏర్పాటుతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటుక బట్టీల నుంచి వచ్చే దుమ్ము, పొగతో ఇక్కట్లకు గురవుతున్నారు. మరోవైపు రోడ్డుపై మట్టి వేయడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రయాణిస్తున్నప్పటికీ.. ఇటుక బట్టీల నిర్వాహకులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శంభాజీ మహారాజ్ సేవలు చిరస్మరణీయం



శంభాజీ మహారాజ్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

మరికల్: మరాఠా సామ్రాజ్యాధినేత శంభాజీ మహారాజ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు యువకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో శంభాజీ మహారాజ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శంభాజీ మహారాజ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రమేశ్, అనిల్, సూర్య, రఘు, వెంకటేశ్, పట్నయ్య, నాగరాజ్, నిఖిల్, చెన్నయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

ధ్యానం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయులు

నారాయణపేట: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీగా ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది ధ్యానం, యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంపై పట్టు సాధించవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజర్ గద్దె ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచన మేరకు జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు ధ్యానం, యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా, ధ్యానంతో శారీరకంగా, మానసికంగా ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వర్తించగలమన్నారు. దైనందిన జీవితంలో యోగా, ధ్యానం భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్ఐలు రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించాలి



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

కోయిల్‌కొండ: ఎండుముఖం పడుతున్న పంటలకు సాగునీరు అందించేందుకు వీలుగా అధికారులు ఏవైనా ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉంటే పరిశీలించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. మంగళవారం మండలంలోని సంగనోనిపల్లి, శేరివెంకటాపూర్ గ్రామాల్లో రైతులు యాసంగిలో వేసుకున్న వరి పంటసాగును ఆమె పరిశీలించారు. బోరు బావుల కింద సాగవుతున్న వరిపైరు ఏస్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉందన్న అంశాలను క్షేత్రస్థాయిలో చూశారు. మండలంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగుచేశారు, ఎంత విస్తీర్ణంలో పంట ఎండిపోయే దశకు చేరింది తదితర వివరాలను కలెక్టర్ ఆరాతీశారు. అనంతరం జమాల్‌పూర్‌లోని నర్సరీని కలెక్టర్ సందర్శించారు. వచ్చే వానాకాలంలో రోడ్‌సైడ్ ప్లాంటేషన్‌కు కావాల్సిన మొక్కలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్‌కు సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనం రుచి చూశారు. ఆమె వెంట డీఏఓ యాసారెడ్డి, తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంపీఓ నజీర్‌హైమద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కృష్ణా: మండల కేంద్రంలోని కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, కృష్ణా పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి.. ఇసుకను అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ నవీద్ తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



గాజులయ్యతండా ప్రాథమిక పాఠశాలలో..

నర్వ/మాగనూర్/మరికల్: నర్వ మండలంలోని కల్వాల్, రాంపూర్, మాగనూర్ మండలం కొల్పూర్, మరికల్ మండలం గాజులయ్యతండా ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. మరికొందరు విద్యార్థులు వివిధ హోదాల్లో అధికారుల బాధ్యతలు నిర్వర్తించారు. కార్యక్రమాల్లో ఎంఈఓ రామకృష్ణ, హెచ్ఎంలు సుదర్శన్, ఉస్మాన్, తిమ్మన్న, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొల్పూర్ పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



కల్వాల్ ప్రాథమిక పాఠశాలలో..